# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 279
పేజీలు : 08 | వెల: రూ.5/-

మంగళవారం
ఆగస్టు 12, 2025


www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




8లో..

## మానసిక వికలాంగుల భద్రతకు ఐరిస్ టెక్నాలజీ

- పార్లమెంట్ లో డాక్టర్ కడియం కావ్య







# షరా మామూలే..

## నీట మునిగిన కాలనీలు

- ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు
- నీటితో నిండుకున్న అండర్ బ్రిడ్జి
- రాకపోకలకు అంతరాయం
- ఇబ్బందులు పడుతున్న ముంపు ప్రాంత వాసులు
- పర్యవేక్షిస్తున్న అధికారులు
- 24 గంటలు అందుబాటులో కంట్రోల్ రూమ్

వివరాలు2లో..

బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం తెల్లవారు జామునుంచి కురుస్తున్న భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షంతో ఓరుగల్లు తడిసి ముద్దయింది. ఇళ్లలోకి వర్షపు నీరు వచ్చి చేరడంతో ఇబ్బందులు తప్పడంలేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా వరంగల్ రైల్వే స్టేషన్ పూర్తిగా నీటితో నిండిపోయింది. ప్లాట్ ఫాం వరకు నీరు చేరడంతో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అండర్ బ్రిడ్జి, మినీ బ్రిడ్జి పూర్తిగా నీటితో నిండిపోయాయి. అండర్ బ్రిడ్జి కిందికి భారీగా చేరిన వర్షపు నీటిలో కారు చిక్కుకోవడంతో రెండు గంటల పాటు ఫ్యామిలీ సభ్యులు అందులోనే బిక్కుబిక్కుమంటూ గడిపారు. ట్రాఫిక్ పోలీసులు రంగ ప్రవేశం చేసి తాళ్లతో కారును నీటినుంచి బయటకు తీయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అదే విధంగా అండర్ రైల్వే గేట్, బీఆర్ నగర్, మిల్స్ కాలనీ, డీకే నగర్, ఎస్ఆర్ఆర్ తోట, సంతోషిమాత కాలనీ, ఎన్టీఆర్ నగర్ తదితర కాలనీలు పూర్తిగా జలమయంగా మారాయి. దీంతో బల్దియా, అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. అత్యవసర సహాయార్థం 24 గంటలు అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నంబర్లు వరంగల్ 1800 425 3434, 9154225936 హనుమకొండ 1800 425 1115, జీడబ్ల్యూఎంసీ 1800 425 1980, 9701999676 ఏర్పాటు చేశారు.

–వరంగల్ వాయిస్, కాశిబుగ్గ



8లో..

## చర్యలు తీసుకోండి

- శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తున్నారు
- పోలీసులకు ప్రెస్ క్లబ్ బాధ్యుల ఫిర్యాదు

## అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

- మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీ
- లోతట్టు ప్రాంతాల సందర్శన

8లో..





# షరా మామూలే..



- నీట మునిగిన కాలనీలు
- ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు
- నీటితో నిండుకున్న అండర్ బ్రిడ్జి
- రాకపోకలకు అంతరాయం
- ఇబ్బందులు పడుతున్న ముంపు ప్రాంత వాసులు
- పర్యవేక్షిస్తున్న అధికారులు
- 24 గంటలు అందుబాటులో కంట్రోల్ రూమ్

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో ఆయా ప్రాంతాలు తడిసి ముద్దయ్యాయి. తెల్లవారు జాము నుంచి కుండపోతగ వర్షం కురుస్తూనే ఉంది. కాలనీలు, లోతట్టు ప్రాంతాలు పూర్తిగా నీటితో నిండిపోయాయి. ప్రధాన రహదారులు సైతం చెరువులను తలపిస్తున్నాయి. భారీ వర్షాలతో అనేక కాలనీలకు చెందిన స్థానికులు చిగురుటాకుల్లా వనికిపోయారు. నగరంలోని ఎస్సార్ నగర్, ఎన్టీఆర్ నగర్, వివేకానంద కాలనీ, సంతోషిమాత కాలనీ, ఎన్టీఆర్ నగర్, సాకరాశి కుంట, శిరంగిరాజారాం తోటతోపాటు శివనగర్ లోని పలు ప్రాంతాలు నీటిలో మునిగాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా కాశీబుగ్గ, గాంధీనగర్ ప్రాంతాలను వరద నీరు ముంచెత్తింది. వరద నీరు ఇళ్లలోకి చేరుకుంది. కాశిబుగ్గ సెంటర్ లోని షాపుల్లోకి నీరు చేరడం ఇదే ప్రధమం అంటూ వ్యాపారులు చెప్పుకొంటున్నారు. రామన్నపేట, శివనగర్, బీఆర్ నగర్, మైసయ్య నగర్, డీకే నగర్, మల్లు స్వరాజ్యం నగర్ లో ఇంట్లోకి నీళ్లు చేరి బియ్యం బస్తాలు, ఇంట్లో సామాగ్రి, ఫ్రిడ్జ్, టీవీలు, పిల్లల పుస్తకాలు తడిసి ముద్దయ్యాయి. కాశికుంటలో వర్షపు నీరు ఇంట్లోకి చేరడంతో లేవలేని స్థితిలో కింద నిద్రపోతున్న పసునూరి బుచ్చమ్మ (80) నీటిలో మునిగి అక్కడికక్కడే మృతి చెందారు. మిల్స్ కాలనీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. నీట మునిగిన వరంగల్ అండర్ బ్రిడ్జి ప్రాంతాన్ని ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, ఇంతేజార్ గంజ్ సీఐ షుకూర్, సిబ్బందితో కలిసి పరిశీలించారు. 32వ డివిజన్ పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్ గోడ కూలడంతో చుట్టు పక్కల ప్రాంతాల వారు భయబ్రాంతులకు గురవుతున్నారు. గతంలో పలు మార్లు హెచ్చరించినప్పటికీ ఫంక్షన్ హాల్ యజమాని నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే వర్షానికి తడిసి కూలిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### 40వ డివిజన్ లో..

నగరంలోని 40 వ డివిజన్ డీకే నగర్ ముంపుకు గురి కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని స్థానిక కార్పొరేటర్ మరుపల్ల రవి జిల్లా కలెక్టర్ సత్య శారద, కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావుకు విన్నవించారు. రాత్రి కురిసిన వర్షంతో డీకే నగర్ లోని 60 ఇండ్లలోకి పెద్ద ఎత్తున వర్షపు నీరు వచ్చి చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేటర్ మరుపల్ల రవి అభ్యర్థన మేరకు సీఎంహెచ్ఓ రాజారెడ్డి, ఎంహెచ్ఓ రాజేష్, తహసిల్దార్ నాగేశ్వరరావు, ఫైర్ ఆఫీసర్ రాజేశ్వర్, ఎలక్ట్రికల్ ఏడీ చంద్రమౌళి, రెవెన్యూ ఆర్ఐ కీర్తన్, మున్సిపల్ ఆర్ఐ లింగమూర్తి, మహానగర పాలక సంస్థ డీఆర్ఎఫ్ రెస్క్యూ టీం సభ్యులు, శానిటేషన్ సిబ్బంది స్పందించారు. ఇళ్లలోనే చిక్కుకున్న వారిని తాళ్లతో సురక్షితంగా రోడ్డుపైకి చేర్చారు. ఉర్సు కురుమ శ్మశాన వాటిక నీటితో నిండిపోయింది. డివిజన్ లో పాతకాలం నాటి గృహాలు నేలమట్టం అయ్యాయి. ఉప్పరోని కుంట సమీపంలోని ముకుంద కాలనీ సమీపంలో ప్రహరీ ప్రధాన బాక్స్ డ్రైన్ లో కూలడంతో మురుగు నీటి ప్రయాణానికి అంతరాయంగా మారింది. డీకే నగర్ ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ సత్య శారద, కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, ఎమ్మెల్సీ కొండ మురళీధర్ రావు సందర్శించారు. డివిజన్ ఆఫీసర్ శంకర్, బిల్ కలెక్టర్ రాజ్ కుమార్, వర్క్ ఇన్స్పెక్టర్ మహేష్, స్థానిక నాయకులు పూజారి విజయ్, కుండే రాజు, తవుటం నరసింహ, పోలం రంజిత్, జవాన్ లు కృష్ణ, ఆదాం, రమేష్ ఉన్నారు.










### అలుగు పోస్తున్న అగర్తల చెరువు

వరంగల్ నగరంలో సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు నగరంలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. కాకతీయుల రాజదాని ఖిలా వరంగల్ కోటలోని అగర్తల చెరువు నిండు కుండను తలపిస్తోంది. భారీగా వస్తున్న వరద నీటితో అలుగుపోస్తూ సందడి చేసింది. ఒక్కసారిగా చెరువు ఉప్పొంగి అలుగు పోయడంతో స్థానికులు ఉత్సాహంతో పొంగే నీటిలో వలలతో చేపలు పడుతూ సందడి చేశారు.

# వరంగల్ లో మొబైల్ ఫోరెన్సిక్ వాహనం

- ప్రారంభించిన సీపీ సన్ ప్రీత్ సింగ్



**వరంగల్ వాయిస్, క్రైం :** నేరానికి సంబంధించి సంఘటన స్థలంలో నిందితులను గుర్తించడంతో పాటు సాక్ష్యాధారాలను సేకరించే ఫోరెన్సిక్ విభాగాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ఫోరెన్సిక్ విభాగం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కు నూతనంగా మొబైల్ ఫోరెన్సిక్ వాహనాన్ని అందజేశారు. ఈ వాహనాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ అత్యాధునిక పరికరాలతో రూపొందించబడిన ఈ మొబైల్ ఫోరెన్సిక్ వాహనంతో మరింత మెరుగైన సేవలందించవచ్చన్నారు. ఇకపై ఎదైనా నేరం జరిగిన ప్రదేశానికి ఫోరెన్సిక్, ఫింగర్ ప్రింట్ అధికారులు, సిబ్బంది ఈ మొబైల్ ఫోరెన్సిక్ వాహనంలో చేరుకొని సంఘటన జరిగిన స్థలం నుంచి రక్తమరకలు, వేలిముద్రలతో ఇతర సాక్ష్యాదారాలను సేకరించి ఈ మొబైల్ వాహనంలో ఏర్పాటు చేసిన అధునిక పరికరాలతో పరీక్షలను నిర్వహించి సంబంధిత దర్యాప్తు అధికారికి ప్రాథమిక సాక్ష్యాధారాలను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమములో అదనపు డీసీపీలు రవి, సురేష్‌కుమార్, రీజినల్ ఎఫ్ఎస్ఎల్ జాయింట్ డైరక్టర్ నీరజ, ఫింగర్ ప్రింట్ విభాగం ఇన్స్పెక్టర్లు రాజ్‌కుమార్, శ్రీధర్, ఆర్ఐలు శ్రీధర్, స్పర్జన్‌రాజ్, శ్రీనివాస్, చంద్రశేఖర్, ఫింగర్ ప్రింట్ ఎస్ఐ కిరణ్‌తో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# వర్షాలపై సీఎం సమీక్ష

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే మూడు రోజులు భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావులతో కలసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి దిశానిర్దేశం చేశారు.

# ‘మెకానికల్ థ్రాంబెక్టమీ’ సర్జరీ సక్సెస్

## ◆ వస్కులర్ సర్జన్ డాక్టర్ ప్రభాకర్




**వరంగల్ వాయిస్, హనుమకొండ:** కాళ్ల నరాల్లో రక్తం గడ్డకట్టే (బ్లడ్ క్లాట్) వ్యాధికి యశోద ఆసుపత్రిలో చేసే “మెకానికల్ థ్రాంబెక్టమీ” చికిత్స విజయవంతమైందని ఆసుపత్రి డాక్టర్ ప్రభాకర్ తెలిపారు. మంగళవారం హనుమకొండలోని కాళోజీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఆపరేషన్ వివరాలను వెల్లడించారు. కాళ్ల నరాల్లో రక్తం గడ్డకట్టడం వల్ల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడుతుందని, అయితే చాలామంది ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తారని డాక్టర్ ప్రభాకర్ చెప్పారు. సరైన సమయంలో చికిత్స అందించకపోతే ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ సమస్యకు మైక్రో సర్జరీ పద్ధతిలో చిన్న కోత పెట్టి, నరాల్లో పేరుకుపోయిన రక్తం గడ్డలను తొలగించే చికిత్స యశోద ఆసుపత్రిలో అందుబాటులో ఉందని ఆయన వివరించారు. జూన్ 14న వరంగల్‌లోని రంగశాయపల్లెకు చెందిన 68 ఏళ్ల సిర్రా సరోజన అనే మహిళకు మెకానికల్ థ్రాంబెక్టమీ చేసి, ఆమెను పూర్తి ఆరోగ్యంగా కాపాడగలిగామని తెలిపారు. ఈ వ్యాధి ముఖ్యంగా నిత్యం కూర్చొని ఉండటం, ధూమపానం, మద్యపానం వంటి అలవాట్ల వల్ల వస్తుందని ఆయన చెప్పారు. కాబట్టి క్రమం తప్పకుండా వాకింగ్ చేయడం, సిగరెట్, మద్యపానానికి దూరంగా ఉండటం ద్వారా ఈ వ్యాధిని నివారించవచ్చని సూచించారు. ఈ సందర్భంగా శస్త్రచికిత్స విజయవంతమైన సరోజన మాట్లాడుతూ యశోద ఆసుపత్రిలో చేసిన ఆపరేషన్ తర్వాత తాను ఆరోగ్యంగా ఉన్నానని, తమకు సహకరించిన డాక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు. యశోద ఆసుపత్రి ఇప్పటికే 30కి పైగా ఇలాంటి శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసిందని డాక్టర్ ప్రభాకర్ పేర్కొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలి

## అధికారులతో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సమీక్ష



**వరంగల్ వాయిస్, పాలకుర్తి** : పాలకుర్తి నియోజకవర్గ శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి పాలకుర్తిలోని తన క్యాంపు కార్యాలయంలో మహబూబాబాద్, జనగామ, వరంగల్ జిల్లాల డీఆర్‌డీఓ అధికారులు, ప్రతినిధులతో విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గానికి చెందిన ఏపీఎంలు కూడా పాల్గొన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గంలోని అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు, ప్రాజెక్టుల పురోగతి, మౌలిక సదుపాయాల మెరుగుదలపై చర్చించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు. డీఆర్‌డీఓ ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ, వారు చేపడుతున్న ప్రాజెక్టులు, రక్షణ సాంకేతికత, వాటి స్థానిక ఉపయోగాలపై అవగాహన కల్పించాలని కోరారు. స్థానిక యువతకు శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏపీఎంలతో మాట్లాడుతూ, మండలాల వారీగా జరుగుతున్న పనుల పురోగతి, సమస్యలు, అవరోధాలపై పూర్తి నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని హెచ్చరించారు. “ప్రతి ప్రాజెక్టు, ప్రతి పథకం సమయానికి పూర్తి కావాలి. ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించడం మనందరి బాధ్యత” అని ఆమె స్పష్టం చేశారు.

# బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి హౌస్ అరెస్టు అప్రజాస్వామికం

## ఖండించిన పెసరు విజయచందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల:** బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావును పోలీసులు అక్రమంగా గృహ నిర్బంధం చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఆయన మాట్లాడుతూ “పోలీసు వ్యవస్థ అధికార పార్టీకి వత్తాసు పలకడం సరికాదు. ‘హర్ ఘర్ తిరంగా’ కార్యక్రమంలో భాగంగా పెద్దమ్మ గుడిలో పూజలు చేయకుండా అడ్డుకోవడం అన్యాయం. ఇది ప్రజాస్వామ్యాన్ని మంటగలిపే చర్య. తెలంగాణలో కాంగ్రెస్ పాలన ఎంత దుర్మార్గంగా ఉందో దీనివల్ల స్పష్టమవుతోంది.” అని విమర్శించారు. గతంలో పెద్దమ్మ గుడిని కూల్చి, అమ్మవారి విగ్రహాన్ని అపహరించి, బోనాలు పగలగొట్టి హిందువులను హింసించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు పూజలు చేయనివ్వడం లేదని ఆరోపించారు. పెద్దమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణానంతరం, తమ ఓటమిని, హిందువుల విజయాన్ని ఓర్వలేక, తిరిగి హిందూ ఆరాధనలపై కుట్రలు పన్నుతున్నారని ఆయన మండిపడ్డారు. “అమ్మవారికి కుంకుమార్చన చేసి, త్రివర్ణ పతాకాలతో తిరంగా ర్యాలీ ప్రారంభించాలనుకున్న రాంచందర్ రావును అకారణంగా గృహ నిర్బంధం చేయడం హిందూ సమాజంపై యుద్ధం ప్రకటించినట్లే. ఆరాధ్య దైవానికి పూజలు చేయడం, జాతీయ పతాకాన్ని గర్వంగా ఎగురవేయడం ప్రతి భారతీయుడి ప్రాథమిక హక్కు. దీన్ని ఎవరూ ఆపలేరు” అని డాక్టర్ విజయచందర్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్‌కు హిందువుల పట్ల గౌరవం లేదని మరోసారి రుజువైందని, భక్తి, భద్రత, జాతీయ గౌరవం కోసం ఈ పోరాటం కొనసాగుతుందని ఆయన హెచ్చరించారు.

# దేవాదుల నీటితో గణపసముద్రం చెరువు నింపాలి



**వరంగల్ వాయిస్, గణపురం :** దేవాదుల గ్రావిటీ కాలువ ద్వారా గణపసముద్రం చెరువును నింపాలని బీజేపీ గణపురం మండల అధ్యక్షుడు ఊర నవీన్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మిషన్ భగీరథకు ఆరు మండలాలకు తాగునీరు సరఫరా అవుతుండటం, వర్షాలు సరిగా కురవకపోవడంతో గణపసముద్రం చెరువు పూర్తిగా అడుగంటిపోయిందని తెలిపారు. చెరువులో ఉన్న కొద్దిపాటి నీటితో రైతులు వరి నాట్లు వేసుకున్నారని, అయితే ఇప్పుడు నీరు లేక నాట్లు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని నవీన్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆయన హెచ్చరించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి దేవాదుల కాలువ ద్వారా గణపసముద్రం చెరువును నింపి వరి నాట్లను కాపాడాలని ఆయన కోరారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని నవీన్ రావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పున్న చందర్ తదితరులు పాల్గొన్నారు.

# కుడా చైర్మన్ ఇనగాలకు సత్కారం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్మన్‌గా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి బాధ్యతలు చేపట్టి సంవత్సరం పూర్తయిన సందర్భంగా, వరంగల్ ఓ–సిటీ కమిటీ సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం కుడా కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో సభ్యులు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఓ–సిటీ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తమ కాలనీలో పలు సమస్యలను పరిష్కరించారని, అన్ని విధాలుగా అండగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇనగాల వెంకట్రామ్ రెడ్డికి మరింత ఉన్నత పదవులు రావాలని ఆకాంక్షించారు.

# రాహుల్ గాంధీ అరెస్ట్‌ను ఖండిస్తున్నాం

## ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** ఓట్ల చోరీపై ప్రశ్నించినందుకు కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీలతో పాటు ఇండియా కూటమి నాయకులను అరెస్టు చేయడాన్ని పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని ఆరోపించారు. గత పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ కుమ్మక్కై దొంగ ఓట్లను సృష్టించి అధికారంలోకి వచ్చాయని రాజిరెడ్డి విమర్శించారు. రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా పర్యటించి, పలు ప్రాంతాల్లో సర్వే నిర్వహించగా, ఒకే ఇంట్లో 40 నుంచి 50 దొంగ ఓట్లు ఉన్నట్లు తేలిందని ఆయన వివరించారు. ఈ దొంగ ఓట్ల సృష్టికి సున్నా నంబర్‌తో కూడిన ఇంటి నంబర్‌లను ఉపయోగించారని ఆరోపించారు. ఈ ఓట్ల చోరీపై రాహుల్ గాంధీ ప్రశ్నించగా, కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ ఎదురుదాడికి దిగి, రాష్ట్రాల వెబ్‌సైట్లను మూసివేశాయని, ఇది ప్రజాస్వామ్య ఉల్లంఘనకు నిదర్శనమని రాజిరెడ్డి పేర్కొన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేయాలని కోరిన నాయకులను అరెస్టు చేయడం మోడీ ప్రభుత్వ వైఖరిని తెలియజేస్తోందన్నారు. ఈ అరెస్టులకు నిరసనగా పరకాల మండల కేంద్రంలో మోడీకి వ్యతిరేకంగా నినాదాలతో ర్యాలీ నిర్వహించి, ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. రాహుల్ గాంధీ చేపట్టిన ఈ పోరాటం ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి అని, ప్రజలంతా ఆయన వెంటే ఉన్నారని రాజిరెడ్డి స్పష్టం చేశారు.

# ఓట్ల చోరీపై ప్రశ్నిస్తే అరెస్టులా ?

## ● కాంగ్రెస్ సీనియర్ నేత అంబాల రాజు



**వరంగల్ వాయిస్, జమ్మికుంట:** దేశ రాజధాని ఢిల్లీలో ఇండియా కూటమి పార్లమెంట్ సభ్యులపై ఎన్డీఏ ప్రభుత్వం వ్యవహరించిన తీరును జమ్మికుంట మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు అంబాల రాజు తీవ్రంగా ఖండించారు. మంగళవారం మడిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న ఓట్ల చోరీపై కాంగ్రెస్ అగ్ర నాయకులు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు ఇతర విపక్ష సభ్యులు ప్రశ్నిస్తే అరెస్టు చేయడం దారుణమన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని, ప్రశ్నించే ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూడటం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఓటే ప్రధాన ఆయుధమని, అలాంటి ఓటును తొలగించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్ణాటకలో లక్ష ఓట్లు, బీహార్‌లో 58 వేల ఓట్లను తొలగించడం ద్వారా బీజేపీ ప్రభుత్వం అధికార దాహాన్ని నిరూపించుకుందని ఆరోపించారు. కేంద్రం ఒత్తిళ్లకు తలొగ్గి ఎన్నికల కమిషన్ ఇష్టానుసారం వ్యవహరించడం సరికాదని అంబాల రాజు హితవు పలికారు. ఈ ఓట్ల చోరీకి నిరసనగా రాహుల్ గాంధీ దేశవ్యాప్త ఉద్యమానికి పిలుపునిచ్చారని ఆయన గుర్తు చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వామ్యం కావాలనుకునేవారు 9650003420 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎగ్గేటి సదానందం, యువజన కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా కార్యదర్శి చెన్నవేన రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మ్యాకమల్ల అశోక్, మడిపల్లి గ్రామశాఖ అధ్యక్షులు ఉప్పుల సాంబశివరెడ్డి, రామిడి సూర్యతేజారెడ్డి, మంగ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

◆ వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు
◆ వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన



**వరంగల్ వాయిస్, ఏనుమాముల :** భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు కోరారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 14వ డివిజన్‌లోని ఎస్ఆర్ నగర్ గ్రామంలో కురిసిన అకాల వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో మంగళవారం ఆయన అధికారులతో కలిసి ముంపు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ వర్షపు నీరు బయటకు వెళ్లే కాలువలు ఇరుకుగా ఉండటంతో నీటి ప్రవాహానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం జీడబ్ల్యూఎంసీ తరపున ఆ కాలువలను విస్తరించే పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు ప్రజలు సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని ఆయన సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజల కోసం ఆహారంతో పాటు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మందులు అందుబాటులో ఉంచామని తెలిపారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉన్నారని, వర్షపు నీటిని వేగంగా బయటకు పంపించడానికి కచ్చా కాలువల ద్వారా చర్యలు తీసుకుంటున్నారని ఆయన వివరించారు. శాశ్వత పరిష్కారం కోసం నాలా విస్తరణతో పాటు డ్రైన్ల ఆక్రమణలను తొలగిస్తామని హామీ ఇచ్చారు. ఎస్.ఆర్. నగర్‌లోని శుభం గార్డెన్‌లో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, అక్కడ అల్పాహారంతో పాటు మధ్యాహ్నం, రాత్రి భోజనం కూడా అందిస్తామని చెప్పారు. ప్రజల సహాయం కోసం వరంగల్, హనుమకొండ కలెక్టరేట్‌లతో పాటు బల్దియా ప్రధాన కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామని, టోల్ ఫ్రీ నంబర్ 18004251980, మొబైల్ నంబర్ 9701999676 కు సంప్రదించాలని కోరారు. జీడబ్ల్యూఎంసీ తరపున రెండు డీఆర్ఎఫ్ బృందాలు మూడు షిఫ్టుల్లో 24 గంటలు పనిచేస్తున్నాయని తెలిపారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు కేటాయింపజేసి, వచ్చే వర్షాకాలం నాటికి చుక్క నీరు నిలవకుండా చూస్తానని ఎమ్మెల్యే నాగరాజు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ తూర్పాటి సులోచన-సారయ్య, డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు ముచ్చర్ల స్టాలిన్, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న ఫోన్ తిరిగి అప్పగింత



**వరంగల్ వాయిస్, చిట్యాల :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని కోసూర్‌పల్లి గ్రామానికి చెందిన ఎండీ సాజిద్ పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను చిట్యాల ఎస్సై జి.శ్రావణ్ కుమార్ తిరిగి అప్పగించారు. వారం రోజుల క్రితం సాజిద్ తన ఫోన్‌ను పోగొట్టుకొని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై ఆదేశాల మేరకు కానిస్టేబుల్ లాల్ సింగ్ ఆ మొబైల్‌ను గుర్తించారు. మంగళవారం ఎస్సై శ్రావణ్ కుమార్ ఆ ఫోన్‌ను సాజిద్‌కు అందజేశారు. తన ఫోన్‌ను తిరిగి ఇచ్చినందుకు సాజిద్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

# అనిశెట్టి రజితకు ప్రజాసంఘాల నివాళి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ప్రముఖ కవయిత్రి, రచయిత్రి, సామాజిక కార్యకర్త, తెలంగాణ ఉద్యమకారురాలు అనిశెట్టి రజిత మరణం పట్ల పలువురు ప్రముఖులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆమె అంతిమయాత్రలో వందలాది మంది కవులు, రచయితలు, మేధావులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. తన జీవితాంతం బంధుమిత్రులపై ప్రేమ, అనురాగాలను పంచిన రజిత అనేక సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారని వక్తలు కొనియాడారు. ఆమె మరణానంతరం తన శరీరాన్ని, నేత్రాలను దానం చేసి మానవతను చాటారని పేర్కొన్నారు. రజిత అంతిమయాత్రలో హేతువాద సంఘం అధ్యక్షురాలు రమాదేవి, డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాతు రమేష్, భారతీయ బౌద్ధ మహాసభ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బొమ్మల అంబేద్కర్‌తో పాటు ప్రజా సంఘాల నాయకులు జిలకర శ్రీనివాస్, ప్రొఫెసర్ బన్న ఐలయ్య, ప్రొఫెసర్ సారంగపాణి, జె.రాజు తదితరులు పాల్గొన్నారు. మెడికల్ కాలేజీ వరకు సాగిన అంతిమయాత్రలో "అనిశెట్టి రజిత జోహార్, జోహార్" అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఆమె భౌతికకాయాన్ని మెడికల్ కాలేజీకి అప్పగించారు. ఈ కార్యక్రమంలో వందల మంది ఉద్యమకారులు, ప్రజా సంఘాల నాయకులు, కవులు, రచయితలు, మేధావులు పాల్గొని ఆమెకు నివాళులు అర్పించారు.

# అనిశెట్టి రజిత మరణం బాధాకరం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రముఖ రచయిత్రి, ప్రజా రచయిత్రుల సంఘం అఖిల భారత అధ్యక్షురాలు అనిశెట్టి రజిత అంతిమయాత్రలో సీపీఎం జిల్లా నాయకులు ఎం. చుక్కయ్య పాల్గొన్నారు. మొదటగా హనుమకొండలోని రెడ్డి కాలనీలో ఉన్న ఆమె స్వగృహంలో రజిత భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం ఆమె దానం చేసిన అవయవాలను వరంగల్ కేఎంసీకి అప్పగించే అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు చుక్కయ్య మాట్లాడుతూ రజిత రచనలు ప్రజలను చైతన్యపరిచే విధంగా ఉండేవని అన్నారు. రచయిత్రిగా ఆమె వందలాది కవితలు రాశారని, సమసమాజ స్థాపన కోసం, మహిళలపై జరిగే అన్యాయాలు, అక్రమాలు, దౌర్జన్యాలపై తన కలం, గళాన్ని వినిపించేవారని కొనియాడారు. ఆమె మరణం ప్రజాస్వామికవాదులకు తీరని లోటని పేర్కొన్నారు. రజిత మృతికి సీపీఎం జిల్లా కమిటీ తరఫున ప్రగాఢ సంతాపం తెలుపుతూ, ఆమె కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రమాదేవి, పలువురు ప్రముఖులు, రచయిత్రులు విద్యాదేవి, డాక్టర్ చంద్రబాను, బన్న ఐలయ్య, అవయవ దాన జిల్లా అధ్యక్ష కార్యదర్శులతో పాటు అనేకమంది పాల్గొన్నారు.

# వినాశకర విధానాలతో దూరమవుతున్న విద్య, వైద్యం

■ ఉచిత విద్య, వైద్యం కోసం ప్రజా పోరాటాలే శరణ్యం
■ ప్రొఫెసర్ వినాయక రెడ్డి, గాదగోని రవి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పాలకుల వినాశనకర విధానాల వల్ల విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలు కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లి పేద, మధ్యతరగతి ప్రజలకు అందని ద్రాక్షగా మారాయని తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామ్య వేదిక కన్వీనర్ ప్రొఫెసర్ వినాయక రెడ్డి, ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు. అమరజీవి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ శతజయంతి వార్షికోత్సవాల సందర్భంగా హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏఐఎఫ్‌డీవై, ఏఐఎఫ్‌డీఎస్ ఆధ్వర్యంలో 'విద్య, వైద్యం - ప్రభుత్వ రంగం' అనే అంశంపై జరిగిన రాష్ట్ర సదస్సులో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సదస్సుకు ఏఐఎఫ్‌డీవై, ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కర్ర రాజిరెడ్డి, పల్లె మురళి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఓంకార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రొఫెసర్ వినాయక రెడ్డి, గాదగోని రవి మాట్లాడుతూ, దేశాభివృద్ధికి మూలకారణమైన విద్య, వైద్య రంగాలను వ్యాపారంగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. 1991లో తీసుకొచ్చిన నూతన ఆర్థిక విధానాల్లో భాగంగా ప్రైవేటీకరణ, సరళీకరణ, ప్రపంచీకరణ పేరుతో ప్రైవేట్ విద్యా సంస్థలు, ఆసుపత్రులకు ఇష్టానుసారంగా అనుమతులిచ్చారని విమర్శించారు. దీంతో ప్రభుత్వ విద్యా సంస్థలు, ఆసుపత్రులను నిర్వీర్యం చేసే విధంగా బడ్జెట్ కేటాయింపులు తగ్గించి, మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ యంత్రాంగం నిబంధనలను పట్టించుకోకపోవడంతో ప్రైవేట్ సంస్థలు ప్రజల బలహీనతలను ఆసరాగా చేసుకొని విపరీతమైన ఫీజులు వసూలు చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వ విద్య, వైద్య రంగాలను బలోపేతం చేయడానికి బడ్జెట్‌లో కనీసం 10 శాతం నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వమే ఈ రంగాలను నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ప్రజలు పెద్ద ఎత్తున పోరాటాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి, యువజన సంఘాల రాష్ట్ర బాధ్యులు పెద్దారపు రమేష్, వస్కుల మట్టయ్య, రాష్ట్ర కార్యదర్శులు వనం సుధాకర్, గడ్డం నాగార్జున, బాలికల రాష్ట్ర కన్వీనర్ మాస్ సావిత్రి, వివిధ ప్రజా సంఘాల రాష్ట్ర నాయకులు గోనె కుమారస్వామి, ఎన్. రెడ్డి హంసారెడ్డి, కుంభం సుకన్య, నర్ర ప్రతాప్, మంద రవి, కొత్తకొండ రాజమౌళి, తాండ్ర కళావతి, ఇస్లావత్ దశరథ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# లంబాడీల సంస్కృతికి ప్రతీక తీజ్ పండుగ

● టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** గిరిజన లంబాడీల సంస్కృతి, సంప్రదాయాలకు తీజ్ పండుగ ప్రతీక అని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి అన్నారు. తొర్రూరు పట్టణంలోని 5వ వార్డు బంజారా నగర్ (దుబ్బ తండా)లో సోమవారం రాత్రి నిర్వహించిన తీజ్ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజన మహిళలతో కలిసి నృత్యం చేసి సందడి చేశారు. ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ తీజ్ పండుగ గిరిజన సంప్రదాయం, భక్తి భావం, క్రమశిక్షణతో పాటు అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతిరూపమని అన్నారు. భారతదేశంలో మొట్టమొదటగా వ్యవసాయాన్ని ప్రారంభించిన లంబాడీ బంజారాలు జరుపుకునే అతి ముఖ్యమైన పండుగ ఇదేనని తెలిపారు. గోర్ బంజారా సంస్కృతిని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, ఈ పండుగను ఘనంగా జరిపి జాతి ఐక్యతను చాటాలని ఆమె పిలుపునిచ్చారు.

**బాధిత కుటుంబాలకు పరామర్శ..**

టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి కొడకండ్ల మండలంలోని పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. రంగాపురం గ్రామంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన కాంగ్రెస్ కార్యకర్తలు సోమారపు ఉప్పలయ్య, సోమారపు యకయ్యల ఇళ్లకు వెళ్లి వారిని పరామర్శించారు. అలాగే, కొడకండ్ల మండల కేంద్రంలో అందె రాములు, మొండ్రై గ్రామంలో బూర్గుల కొండయ్య, మైదం చెరువు తండాలో బానోత్ వాలి గార్ల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపి, ఆర్థిక సహాయం అందించారు. మండల అధ్యక్షులు, యువజన అధ్యక్షులు, పట్టణ, మండల సీనియర్ నాయకులు, యువజన నాయకులు, మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాల్కురికి స్మృతివనం గౌరవాన్ని కాపాడాలి

## ◆ పరిశుభ్రతపై ఎమ్మెల్యే యశస్విని రెడ్డి దృష్టి

**వరంగల్ వాయిస్, పాలకుర్తి :** ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పాలకుర్తి పట్టణంలోని పాల్కురికి సోమనాథుని స్మృతివనాన్ని సందర్శించారు. తెలుగు సాహిత్యంలో ప్రముఖ కవి అయిన పాల్కురికి సోమనాథుని జ్ఞాపకార్థం నిర్మించిన ఈ ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రదేశాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా స్మృతివనంలోని ఉద్యానవనం, సాహిత్య ప్రదర్శనశాల, విగ్రహాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ ఇంతటి పవిత్రమైన ప్రదేశంలో అవాంఛనీయ ఘటనలు జరుగుతుండటం విచారకరమని అన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిని గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, అధికారులను కోరారు. స్మృతివనాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, పర్యాటకులు, భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. స్మృతివనం గౌరవాన్ని కాపాడే బాధ్యత స్థానిక ప్రజలు కూడా తీసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సాంస్కృతిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలల్లో వైద్య సౌకర్యాలు కల్పించాలి..

మండల వైద్యాధికారులతో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలని ఆమె అధికారులను ఆదేశించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య పరికరాలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. పిల్లల ఆరోగ్య పరీక్షలను నిరంతరం నిర్వహించి, పోషకాహార లోపాలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మండల వైద్యాధికారి, ఆరోగ్య సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# టీబీ రోగులకు న్యూట్రిషన్ కిట్లు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని ప్రగతి సింగారం సబ్ సెంటర్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అల్లం అప్పయ్య బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సబ్ సెంటర్ పరిధిలో క్షయవ్యాధి (టీబీ)కి చికిత్స పొందుతున్న ముగ్గురు రోగులకు ఆయన న్యూట్రిషన్ కిట్లను అందజేశారు. మండల వైద్యాధికారి డాక్టర్ ఎన్. సాయి కృష్ణ, ప్రగతి సింగారం ఏఏఎం డాక్టర్, ఏఎన్ఎం ఆశాలు పాల్గొన్నారు. క్షయ వ్యాధి చికిత్సతో పాటు పౌష్టికాహారం కూడా చాలా ముఖ్యమని ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ పేర్కొన్నారు.

# లధక్‌లో రెడ్ క్రాస్ సేవా స్ఫూర్తి

## రెడ్ క్రాస్ జెండాను ఎగురవేసిన సాత్విక




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండకు చెందిన యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్ ఈవీ.సాత్విక లధక్‌లోని ఖర్దుంగ్‌లా పర్వత శిఖరంపై రెడ్ క్రాస్ జెండాను ఎగురవేసి సేవా స్ఫూర్తిని చాటారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన మోటారు మార్గాలలో ఒకటైన ఖర్దుంగ్‌లా (17,582 అడుగులు) వద్ద ఆమె ఈ సాహసం చేశారు. ఈ సందర్భంగా సాత్విక మాట్లాడుతూ పదో తరగతి నుంచే రెడ్ క్రాస్ సొసైటీ పట్ల తన తండ్రి చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాల పట్ల ఆకర్షితురాలినయ్యానని తెలిపారు. జాతీయ స్థాయిలో శిక్షణ పొంది, అనేక రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొన్నానని చెప్పారు. తనతో పాటు మరికొందరిలో కూడా రెడ్ క్రాస్ పట్ల చైతన్యం కలిగించడమే తన లక్ష్యమని, సమాజ సేవనే తన జీవిత లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. సమాజ సేవ పట్ల సాత్విక చూపుతున్న అంకితభావం, ధైర్యం, త్యాగం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, ఆమె తెలంగాణ యువతకు ఆదర్శంగా నిలిచారని పలువురు ప్రశంసించారు.

# అనిశెట్టి రజిత పార్థివదేహం మెడికల్ కాలేజీకి అందజేత



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రముఖ రచయిత్రి, ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ అధ్యక్షురాలు అనిశెట్టి రజిత గుండెపోటుతో మరణించిన విషయం తెలిసిందే. ఆమె కోరిక మేరకు సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆమె నేత్రాలను, పార్థివదేహాన్ని దానం చేశారు. మంగళవారం ఆమె పార్థివదేహాన్ని కాకతీయ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యకు అప్పగించారు. సంవత్సరం క్రితం తిరుకోవళ్లూరు శ్రీలక్ష్మి సంస్మరణ సభ సందర్భంగా రజిత శరీర దానం చేసేందుకు ముందుకొచ్చారని సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ఆ ఆశయం మేరకు సోమవారం ఎల్‌వీపీ టెక్నీషియన్ల చేత నేత్రదానం చేయించి, మంగళవారం పార్థివదేహాన్ని మెడికల్ కాలేజీకి అప్పగించినట్లు పేర్కొన్నారు. రజిత తన జీవితమంతా మహిళా సమస్యలు, పేదల కోసం పోరాడారని, అనేక ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్న నాయకురాలిగా ప్రసిద్ధి చెందారని పలువురు కొనియాడారు. కవయిత్రిగా, రచయిత్రిగా, గాయకురాలిగా ఎన్నో పుస్తకాలు, కవితలు, పాటలు రాశారని గుర్తు చేసుకున్నారు. కాళోజీ స్ఫూర్తితోనే ఆమె నేత్ర, శరీర దానం చేశారని వక్తలు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో రమాదేవి, ఇందిర, శ్యామల, సుజాత, అంజనీ దేవి, బ్రహ్మాచారి, మహేందర్, శ్రవణ్ కుమార్, శంకర్రావు, పురుషోత్తం సుబ్బారావు, సోమయ్య, చారి, మల్లారెడ్డి, ఉపేందర్ రెడ్డి, డాక్టర్ రాజేంద్రప్రసాద్, ప్రముఖ కవులు అంపశయ్య నవీన్, నలిమెల భాస్కర్, అన్నవరం దేవేందర్, శ్రీనివాసరావుతో పాటు పలువురు కవులు, రచయితలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# రచయిత్రి అనిశెట్టి రజిత మృతి బాధాకరం

## దాస్యం వినయ్ భాస్కర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రముఖ రచయిత్రి, ప్రజాస్వామికవాది అనిశెట్టి రజిత మరణం బాధాకరమని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. మంగళవారం ఆయన హనుమకొండలోని రజిత స్వగృహానికి వెళ్లి ఆమె భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో రజిత క్రియాశీలకంగా పనిచేశారని గుర్తు చేసుకున్నారు. విలువలతో కూడిన జీవితాన్ని గడిపిన ఆమె, స్త్రీ సమానత్వం కోసం తన రచనల ద్వారా సమాజంలో చైతన్యం తీసుకొచ్చారని కొనియాడారు. మరణానంతరం ఆమె తన పార్థివదేహాన్ని దానం చేయడం ఎందరికో ఆదర్శమని ఆయన ప్రశంసించారు. రజిత ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# అవినీతి కార్యదర్శిపై చర్యలేవీ..!

## మాజీ ఎంపీటీసీ బీరం రజనీకర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** గూడెంపాడు గ్రామ పంచాయతీ నిధుల అవినీతిపై గ్రామ కార్యదర్శి క్రాంతి కుమార్ పై చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీటీసీ బీరం రజనీకర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం గూడెంపాడులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. గూడెంపాడు వ్యవసాయ మార్కెట్ నుంచి చెక్కుల రూపంలో వచ్చిన పన్నులను గ్రామ కార్యదర్శి రికార్డుల్లో నమోదు చేయకుండా నిధులను పక్కదారి పట్టించారని రజనీకర్ రెడ్డి ఆరోపించారు. దీనిపై ఫిర్యాదు చేసినప్పటికీ, డీపీఓ విచారణ జరిపి చర్యలు తీసుకోకపోవడంపై ఆయన అనుమానం వ్యక్తం చేశారు. గ్రామ కార్యదర్శిపై కాకుండా కిందిస్థాయి పంచాయతీ సిబ్బందిపై చర్యలు తీసుకోవడం సరికాదని అన్నారు. డీపీఓ అండదండలు క్రాంతి కుమార్‌కు ఉన్నాయని ఆయన విమర్శించారు. వ్యవసాయ శాఖ నుంచి పంచాయతీకి అందిన నిధులు ఏమయ్యాయో కార్యదర్శి చెప్పాలని ఆయన ప్రశ్నించారు. కార్యదర్శిపై జరిపిన విచారణ నివేదికను గ్రామస్తుల సమక్షంలో బహిర్గతం చేయాలని రజనీకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ ఉప సర్పంచ్ వీసం శ్రీనివాసరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ కాంతాల కేశవరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ జనగాం సాంబయ్య, టీఆర్ఎస్ నాయకులు కాంతాల రవీందర్ రెడ్డి, రేమిడి బుచ్చిరెడ్డి, చిమ్మని భిక్షపతి, రేమిడి కృష్ణారెడ్డి, బుర్ర రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

# అనిశెట్టి రజిత మరణం సమాజానికి తీరని లోటు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కవయిత్రి, సామాజిక కార్యకర్త అనిశెట్టి రజిత మరణం పట్ల మానవ హక్కుల వేదిక కార్యకర్త ఎస్. జీవన్ కుమార్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అనిశెట్టి రజిత తన చిన్నతనం నుంచే తనకు పరిచయమని, తాము కుమార్ పల్లి దాటిన తర్వాత ఉన్న రెడ్డి కాలనీలో పక్కపక్కనే ఇల్లు కట్టుకున్నామని తెలిపారు. నక్సలైట్ ఉద్యమం ఉచ్ఛస్థితిలో ఉన్నప్పుడు కూడా ఆమె తమ వాడలోని సమస్యలపై గట్టిగా పోరాడేవారని గుర్తు చేసుకున్నారు. ఒక సందర్భంలో తన దగ్గరి బంధువు అయిన ఒక టీచర్ చిన్న గుడి పక్కన ఉన్న ఒక సందును ఆక్రమించుకున్నప్పుడు, బంధుత్వం చూడకుండా ఆందోళన నిర్వహించారని, అప్పుడు తమ సంస్థ మద్దతుగా నిలిచి ఆ స్థలాన్ని కబ్జా నుంచి కాపాడగలిగామని వివరించారు. అనిశెట్టి రజిత ప్రజాస్వామిక వాది అని, తీవ్ర నిర్బంధం ఉన్న రోజుల్లో కూడా ధైర్యంగా మాట్లాడేవారని తెలిపారు. మహిళల హక్కులు, సమాజంలో మహిళల పరిస్థితిపై ఆమెకు పూర్తి అవగాహన ఉందని పేర్కొన్నారు. నర్రా ప్రభాకర్ రెడ్డి హత్య తర్వాత పౌర హక్కుల సంఘం బలహీనపడినప్పుడు, దళిత హక్కుల నాయకుడు పెండెం కట్టయ్య, బుర్ర రాములు సహకారంతో ఇతర మహిళలతో కలిసి మహిళా సంఘాన్ని ఏర్పాటు చేసి ఎన్నో కార్యక్రమాలు చేశారని కొనియాడారు. కాళోజి జయంతి నాడు తప్పకుండా ఆయన ఇంటి వద్ద కలుసుకునేవారని, వరంగల్ మిత్రమండలిలో ఆమె సభ్యురాలిగా ఉన్నారని చెప్పారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో జిల్లా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో ఆమె చాలా కృషి చేశారని తెలిపారు. ప్రస్తుతం క్రియాశీలకంగా ఉన్న ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక ఏర్పాటులోనూ, నిర్వహణలోనూ ఆమె కీలక పాత్ర పోషించారని అన్నారు. ఈ సంస్థ సభ్యులకు, ముఖ్యంగా ఆమెకు సన్నిహిత స్నేహితురాలిగా ఉన్న కాత్యాయని విద్మహేకు ఇది తీరని లోటని పేర్కొన్నారు. వరంగల్, హనుమకొండలో ఎప్పుడూ వినిపించే ఆమె గొంతు మూగబోవడం విషాదకరమని, అనిశెట్టి రజిత మృతికి వ్యక్తిగతంగా, మానవ హక్కుల వేదిక తరపున ప్రగాఢ సంతాపం తెలుపుతున్నానని జీవన్ కుమార్ తెలిపారు.



## ఒక సాహితీ కిరణం రాలిపోయింది



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ప్రముఖ కవయిత్రి, సామాజిక కార్యకర్త అనిశెట్టి రజిత మరణం సాహితీ లోకానికి తీరని లోటని తెలంగాణ నేత్ర అవయవ దాన అసోసియేషన్ సభ్యులు నిమ్మల శ్రీనివాస్ అన్నారు. ఆమె మరణం పట్ల ఆయన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ అనిశెట్టి రజిత తన కవితల ద్వారా కవితా ప్రపంచాన్ని ఆలోచింపజేశారని కొనియాడారు. ఎన్నో విలువైన పుస్తకాలు రచించి, ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారని అన్నారు. తన జీవితాంతం సమాజ హితం కోసం పోరాడిన రజిత, మరణానంతరం కూడా తన నేత్రాలను దానం చేసి, పార్థివదేహాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనల కోసం కాకతీయ మెడికల్ కళాశాలకు అప్పగించడం గొప్ప విషయమని ప్రశంసించారు. ఆమె భౌతికంగా దూరమైనా, అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన అనిశెట్టి రజిత కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

### బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంజిత్ కుమార్



**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు, భారతదేశ స్వాతంత్ర్య అమృతోత్సవాల సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేపీ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు కనుకుంట్ల రంజిత్ కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం 'మహా సంపర్క్ ఘర్ ఘర్ తిరంగా'లో భాగంగా జరుగుతుందని ఆయన తెలిపారు. ఆగస్టు 13 నుంచి 15 వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయడం ద్వారా ప్రజల్లో దేశభక్తి భావనను, జాతీయ జెండా పట్ల గౌరవాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమం లక్ష్యమని రంజిత్ కుమార్ అన్నారు. ప్రజలు తమ ఇళ్లపై జెండాలను ఎగురవేయడమే కాకుండా, సోషల్ మీడియాలో కూడా జెండాతో ఉన్న తమ ఫొటోలను పంచుకోవాలని ఆయన కోరారు.

## గణపురంలో ఘర్ ఘర్ తిరంగా ర్యాలీ



**వరంగల్ వాయిస్, గణపురం:** భారతదేశ 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని, ప్రతి భారతీయుడు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని బీజేపీ గణపురం మండల అధ్యక్షుడు ఊర నవీన్ రావు అన్నారు. 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా గణపురంలో మండల బీజేపీ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులతో జాతీయ జెండా విశిష్టతను ప్రదర్శిస్తూ ప్రచార ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం పాల్గొన్న విద్యార్థులకు పండ్లు పంపిణీ చేసి, సహకరించిన ఫ్రోబెల్, నారాయణ పాఠశాలల యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలిపారు. హర్ ఘర్ తిరంగా ర్యాలీ కన్వీనర్ మండల రాజు, సీనియర్ నాయకులు సోమ దామోదర్, దుగిశెట్టి పున్నమ్ చందర్, మంద మహేష్, ఉపాధ్యక్షులు మాదాసు మొగిలి, డాకూరి కృష్ణ రెడ్డి, బూత్ అధ్యక్షులు కాశెట్టి సాయి, రేపాక సంతోష్, వేముల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్, అదనపు డీసీపీ ఆర్. ప్రభాకర్ రావు, ఏసీపీ టి.సత్యనారాయణ పర్యవేక్షణలో వరంగల్ ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 19 మందిని మంగళవారం గౌరవ మేజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేశం ఎదుట హాజరుపరచగా ఒకరికి జైలు శిక్ష, 18 మందికి జరిమానా విధించారు. నెక్కొండకు చెందిన బానోత్ సంపత్ అనే కూలీకి రెండు రోజుల జైలు శిక్ష పడటంతో అతన్ని హుజురాబాద్ సబ్ జైలుకు పంపించారు. మిగిలిన 18 మందికి మొత్తం రూ.19,700 జరిమానా విధించారని వరంగల్ ట్రాఫిక్ పీఎస్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కె. సుజాత తెలిపారు. అలాగే, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ఇద్దరికి రూ. 3,000 జరిమానా విధించారని ఆమె పేర్కొన్నారు.

# దొంగ ఓట్లతో గద్దెనెక్కిన బీజేపీ గద్దె దిగాలి

### ◆ రాహుల్ కు ప్రజా సంఘాల మద్దతు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రజాస్వామ్యంలో ఎన్నికలు అనివార్యమని, కానీ దొంగ ఓట్లతో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం వెంటనే దిగిపోవాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థులు, న్యాయవాదులు డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ అమరవీరుల స్థూపం వద్ద టీఎస్ఎఫ్, పీఎస్ఎఫ్, వీసీకే ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో వారు ఈ మేరకు నినాదాలు చేశారు. వీసీకే పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, కన్నం సునీల్, వరంగల్ బార్ అసోసియేషన్ మాజీ జిల్లా అధ్యక్షుడు తీగల జీవన్ గౌడ్, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, కాంగ్రెస్ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ కూనూరు రంజిత్ గౌడ్ తదితరులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ ప్రజాస్వామ్య ఎన్నికలను ఈవీఎంల ద్వారా నాశనం చేసి, దొంగ ఓట్లతో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే బీజేపీ వెంటనే అధికారం నుంచి దిగిపోవాలని డిమాండ్ చేశారు. దొంగ ఓట్ల కుంభకోణాన్ని బయటపెట్టిన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి అన్ని ప్రగతిశీల, ప్రజాస్వామ్య శక్తులు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడుతున్న శక్తులన్నీ ఐక్యమై ఈవీఎంలు రద్దయ్యే వరకు పోరాడాలని వారు పిలుపునిచ్చారు. గత 20 ఏళ్లుగా బ్యాంసెఫ్ వంటి సంస్థలు ఈవీఎంల రద్దు కోసం పోరాడుతున్నా, దొడ్డిదారిన అధికారంలోకి రావడానికి అలవాటుపడిన పాలకవర్గాలు ఈవీఎంలను వదలడం లేదని విమర్శించారు. దొంగ ఓట్ల కుట్రలో భాగమైన అధికారులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఆశీర్వాదం, గునిగంటి శ్రీనివాస్, దయాల సుధాకర్, ఇజ్జగిరి సురేష్, జన్ను పద్మ, ఆరేపల్లి త్రివేణి, అడ్లూరి పద్మ, శామంతుల శ్రీనివాస్, ఎగ్గడి సుందర్ రామ్, వివిధ సంఘాల నాయకులు కన్నాల రవి, రామంచ శ్రీను, నాగారం మనీతేజ, బన్నీ, జరిపోతుల వంశీ కృష్ణ, తోట రమేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## చిట్యాలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేయాలి

**వరంగల్ వాయిస్, చిట్యాల :** మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం (ఏవైఎస్) రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం చిట్యాల మండల అధ్యక్షుడు జన్నే యుగేందర్‌తో కలిసి ఆయన ఈ డిమాండ్‌ను స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మల దృష్టికి తీసుకెళ్లారు. పుల్ల మల్లయ్య మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు ఇంటర్మీడియట్ తర్వాత దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోలేకపోతున్నారని, దీంతో మధ్యలోనే చదువు మానేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిట్యాల పాత తాలూకా అయినందున ఇక్కడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయడం వల్ల చిట్యాలతో పాటు టేకుమట్ల, మొగుల్లపల్లి, రేగొండ మండలాల విద్యార్థులకు కూడా ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ప్రత్యేక చొరవ తీసుకొని వెంటనే ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేయాలని ఆయన కోరారు.



## యువతే దేశానికి వెన్నెముక




**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** ప్రపంచానికి, దేశాలకు యువతే వెన్నెముక అని, వారి భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని మహాత్మా జ్యోతిబా పూలే పెద్దాపూర్ బాలికల ప్రిన్సిపాల్ దామెర అనిత అన్నారు. మంగళవారం అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఒక దేశం అభివృద్ధి చెందడానికి ఆ దేశ యువత కృషి ఎంతో ముఖ్యమని అనిత తెలిపారు. భారతదేశంలో యువత ఎక్కువ సంఖ్యలో ఉన్నందున, మన దేశం కూడా అభివృద్ధి పథంలో నడుస్తోందని ఆమె పేర్కొన్నారు. దేశాభివృద్ధిలో విద్యార్థులు పాలుపంచుకోవాలని, తద్వారా దేశ పురోగతికి తోడ్పడాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె లైబ్రేరియన్ సైన్స్ పితామహుడు ఎస్.ఆర్. రంగనాథన్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏటీపీ చంద్రకళ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** అకాల వర్షాలకు నష్టపోయిన 29వ డివిజన్ పాపయ్యపేట వరద బాధితులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో వరంగల్ ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు కురిసిన భారీ వర్షానికి వరంగల్ నగరం నీట మునిగిందని, అనేకమందికి నష్టం వాటిల్లిందని సీపీఎం వరంగల్ జిల్లా కమిటీ సభ్యులు సింగారపు బాబు తెలిపారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడమే ఈ పరిస్థితికి కారణమని ఆయన ఆరోపించారు. 2014లో రూ. 2,000 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేసినా పనులు చేపట్టలేదని, ప్రస్తుతం రూ. 4,175 కోట్లతో మరో డీపీఆర్ చేసినా పనులు ప్రారంభించలేదని విమర్శించారు. మంత్రి కొండా సురేఖ వెంటనే ఈ సమస్యపై స్పందించి, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టాలని సీపీఎం డిమాండ్ చేసింది. నష్టపోయిన ప్రతి కుటుంబానికి రూ. 25,000తో పాటు 50 కిలోల బియ్యం సంచిని అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆరూర్ కుమార్, సుజాత, రంగరాజు, విజయ, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



**వరంగల్ వాయిస్, దామెర :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మండల యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గడల నరేష్ పిలుపునిచ్చారు. మంగళవారం దామెర మండలంలోని దమ్మన్నపేట, పులుకుర్తి, లాదెళ్ల గ్రామాల్లో జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని ఆయన కార్యకర్తలను కోరారు. ప్రభుత్వం పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తుందని, బీసీలకు రాజకీయ, ఉద్యోగ, విద్యా రంగాల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తోందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ చేసిన మొదటి రాష్ట్రం తెలంగాణ అని, సన్నబియ్యం, రేషన్ కార్డులు వంటి పథకాలతో పేదల సంక్షేమానికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. అలాగే, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్ వంటి హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని నరేష్ తెలిపారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు, ప్రజలు సైనికుల్లా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశాల్లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దుబాసి రాజేందర్, గడల బాబు, గంకిడి సాంబ రెడ్డి, సొప్పరి సాంబయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

# సతీలీలావతి చిత్రం పెళ్లిపాట విడుదల



లావణ్య త్రిపాఠి, దేవ్ మోహన్ ప్రధానపాత్రల్లో రానున్న చిత్రం 'సతీ లీలావతి'కి తాతినేని సత్య దర్శకత్వం వహించారు. తాజాగా ఈ సినిమా నుంచి పెళ్లిపాటను టీమ్ విడుదల చేసింది. 'ఓరి పిల్లా..చిత్తూరు పిల్లా..' అంటూ సాగే ఈ పాటకు వనమాలి లిరిక్స్ అందించగా.. నూతన్ మోహన్, కృష్ణ తేజస్వీ ఆలపించారు. మిక్కీ జే మేయర్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. త్వరలోనే దీని విడుదల తేదీని ప్రకటించనున్నారు.




## రావు బహద్దూర్‌గా సత్యదేవ్

'కేరాఫ్ కంచరపాలెం' ,'ఉమా మహేశ్వర ఉగ్ర రూపస్య' వంటి చిత్రాలతో స్టార్ డైరెక్టర్‌గా గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు వెంకటేశ్ మహా చాలా రోజుల తర్వాత తన కొత్త సినిమాను ప్రారంభించాడు. వెంకటేశ్ మహా దర్శకత్వంలో రాబోతున్న తాజా చిత్రం రావుబహదూర్. ఈ సినిమాలో సత్యదేవ్ కథానాయకుడిగా నటించబోతున్నాడు. తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ –టైటిల్‌తో పాటు– ఫస్ట్ లుక్‌ని విడుదల చేసింది. ఇందులో సత్యదేవ్ రావు బహదుర్ అనే జమిందార్ పాత్రలో కనిపించబోతున్నట్లు– తెలుస్తుంది. జీఎంబీ, శ్రీచక్ర ఎంటర్–టైనమెంట్స్ బ్యానర్‌లపై అనురాగ్ రెడ్డి, చింత గోపాలకృష్ణ రెడ్డి, శరత్ చంద్ర నిర్మించబోతున్నారు. ఈ ఫస్ట్ లుక్ చూస్తుంటే.. సత్యదేవ్ వృద్ధుడి పాత్రలో ఉండగా.. అతడి చుట్టు– చిన్నపిల్లలు ఉండడం చూడవచ్చు. ఈ సినిమాను వచ్చే ఏడాది సమ్మర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు– చిత్రబృందం ప్రకటించింది.

## విదేశాల్లో స్పిరిట్ తొలి షెడ్యూల్

కథానాయకుడు ప్రభాస్.. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కలయికలో 'స్పిరిట్' పేరుతో బహుభాషా చిత్రం రూపొందనున్న సంగతి తెలిసిందే. ప్రణయ్ రెడ్డి వంగా, భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. త్రిప్తి దిమ్రి కథానాయిక. ఈ సినిమా సెప్టెంబరు నెలాఖరున పూజా కార్యక్రమాలతో ప్రారంభం కానుంది. అయితే తొలి షెడ్యూల్ మాత్రం విదేశాల్లో మొదలు కానుందని సమాచారం. దీనికోసం సందీప్ ఇప్పటికే మెక్సికో, ఇండోనేషియా, మలేషియా, బ్యాంకాక్ తదితర దేశాల్లో లొకేషన్లు రెక్కీ చేసి పెట్టుకున్నారు. సినిమాలోని కీలక షెడ్యూల్స్‌ను అక్కడే ప్లాన్ చేస్తున్నట్లు– తెలిసింది. ప్రభాస్ నవంబరు నాటికి సెట్లోకి అడుగు పెట్టే అవకాశమున్నట్లు తెలుస్తోంది.



# సింగపూర్‌లో రజనీ మేనియా

### కూలీ సినిమా కోసం సెలవు ప్రకటించిన ఓ సంస్థ

తలైవర్ సూపర్ స్టార్ రజనీకాంత్ క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అతడి సినిమా వస్తుందంటే చాలు వరల్డ్ వైడ్‌గా ఉన్న అతడి అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తుంటారు. అయితే ఆయన నటించిన తాజా చిత్రం 'కూలీ' విడుదల సందర్భంగా సింగపూర్‌లోని ఓ కంపెనీ తమ ఉద్యోగులకు పెయిడ్ హాలిడే ప్రకటించడం ప్రస్తుతం వైరల్‌గా మారింది. కూలీ సినిమా ఆగష్టు 14న విడుదలవుతున్న సందర్భంగా.. సింగపూర్‌లోని ఫార్మర్స్ కన్‌స్ట్రక్షన్స్ పీటీఈ లిమిటెడ్ అనే సంస్థ తమ తమిళ ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా సెలవు మంజూరు చేసింది. అంతేగాకుండా.. సినిమా మొదటి రోజు ఫస్ట్ షో టికెట్లతో పాటు–, ఆహారం, పానీయాల ఖర్చుల కోసం 30 సింగపూర్ డాలర్లను కూడా అందిస్తామని ప్రకటించింది. ఉద్యోగుల సంక్షేమం, ఒత్తిడి నిర్వహణలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు– ఆ సంస్థ వెల్లడిరచింది. ఈ ప్రకటన ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, భారతదేశంలోని రజినీ అభిమానులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇందులో నాగార్జున, ఆమిర్ ఖాన్, ఉపేంద్ర వంటి దిగ్గజ నటు–లు కీలక పాత్రలు పోషిస్తుండటంతో సినిమాపై హైప్ మరింత పెరిగింది.


### విడుదలకు ముందే కూలీ కలెక్షన్ల రికార్డు

రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో విడుదలవుతున్న చిత్రం 'కూలీ' విడుదలకు ముందే రికార్డులను సొంతం చేసుకుంది. తాజాగా ప్రీ బుకింగ్స్ ఓపెన్ చేయడంతో టికెట్స్ హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి. దీంతో ఓవర్సీస్‌లో రికార్డు నమోదైంది. విడుదలకు రెండు రోజుల ముందే 'కూలీ' రెండు మిలియన్ల క్లబ్‌లో చేరిపోయింది. ప్రీమియర్స్‌లోనే ఈ స్థాయిలో వసూళ్లు సాధించిన మొదటి తమిళ సినిమాగా రికార్డు నెలకొల్పింది. 2016లో రజనీకాంత్ నటించిన 'కబాలి' నార్త్ అమెరికాలో విడుదలకు ముందే 60 వేల డాలర్లు వసూళ్లు చేసిన మొదటి తమిళ సినిమాగా రికార్డు నెలకొల్పింది. ఇప్పుడు మళ్లీ తొమ్మిదేళ్ల తర్వాత ఆయన రికార్డును ఆయనే బ్రేక్ చేశారు. సూపర్‌స్టార్ రికార్డును బ్రేక్ చేయడం మళ్లీ ఆయనకే సాధ్యమని అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు.

### 14న విడుదలవుతున్న కూలీ, వార్-2

తెలుగు రాష్ట్రాల్లో యధావిధిగా టిక్కెట్ రేట్లు

కూలీ, వార్ 2 సినిమాలకు తెలంగాణలో టికెట్లు రేట్లు పెంచబోతున్నట్లు సోమవారం సాయంత్రం నుంచి వార్తలు వైరలయ్యాయి. అయితే ఈ నిర్ణయంపై అటు– అభిమానులతో పాటు– మువీ లవర్స్ కూడా తీవ్రంగా తప్పుబట్టారు. డబ్బింగ్ సినిమాలకు కూడా టికెట్ రేట్లు పెంచి ఈ దోచుకోవడం ఏంటి అని సోషల్ మీడియాలో నిర్మాతలతో పాటు– తెలంగాణ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. దీంతో టికెట్ ధరలపై నిర్మాతలు వెనక్కి తగ్గినట్లు తెలుస్తుంది. సాధారణ టికెట్ ధరలకే ఈ సినిమా టికెట్‌లను అందుబాటులో ఉంచబోతున్నట్లు– సినీ వర్గాల సమాచారం. దీనికి సంబంధించి అప్‌డేట్ రానుంది. మరోవైపు ఈ రెండు సినిమాల బుకింగ్స్ ఓపెన్ కాబోతున్నాయి. రజనీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న కూలీ సినిమాతో పాటు– హృతిక్ రోషన్, ఎన్టీఆర్ ప్రధాన పాత్రల్లో రాబోతున్న వార్ 2 చిత్రం ఆగష్టు 14న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. అయితే ఈ రెండు డబ్బింగ్ సినిమాలకు తెలంగాణతో పాటు– ఆంధ్రప్రదేశ్‌లో టికెట్ రేట్లు– పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చినట్లు– వార్తలు వస్తున్నాయి. కూలీ సినిమాకు తమిళనాడులో అత్యధిక టికెట్ ధర రూ.190 రూపాయలు ఉండగా.. తెలుగు రాష్ట్రాల్లో వచ్చేసరికి ఆ ధర దాదాపు రూ.450 నుంచి రూ.500 వరకు వెళుతుందని అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు హిందీ నుంచి వస్తున్న డబ్బింగ్ చిత్రం వార్ 2 కి కూడా హిందీలో రూ.250 టికెట్ రేట్లు– ఉండగా.. తెలంగాణలో రూ.400 వరకు ఉండబోతుందని వార్తలు వస్తున్నాయి. ఒకవేళ ఇవే రేట్లు– కొనసాగితే.. భవిష్యత్తులో ప్రేక్షకులు థియేటర్లకి రావడం మానేసి.. ఓటీటీ– లేదా.. పైరసీ వెబ్‌సైట్‌లకు అలవాటుపడతారని విశ్లేశకులు భావిస్తున్నారు.



WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

మంగళవారం, ఆగస్టు 12, 2025



# చర్యలు తీసుకోండి

**శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తున్నారు**

**పోలీసులకు ప్రెస్ క్లబ్ బాధ్యుల ఫిర్యాదు**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం సుబేదారి పీఎస్ లో ప్రెస్ క్లబ్ బాధ్యులు, ఐజేయూ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారం సదయ్య మాట్లాడుతూ తాము పదిరోజులుగా ఇన్సూరెన్స్ చేయిస్తున్నామని, ఇది చారిత్రాత్మకమని, ఇప్పటివరకు రాష్ట్రంలో ఏ క్లబ్ చేయని పనిని తమ కమిటీ చేస్తున్నదన్నారు. కొందరు ఈ విషయాన్ని అభినందించకపోగా తమపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. క్లబ్ గోడ కడుతుండగా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఆగష్టు 15 న క్లబ్ సభ్యులకు చారిత్రక ప్రకటన చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో కొందరు కావాలని అపోహలు సృష్టించి సభ్యులను గందరగోళానికి గురిచేసే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. గతంలో క్లబ్ నిధులను దుర్వినియోగం చేసినట్లుగా అన్ని యూనియన్లు, క్లబ్ కార్యవర్గం ఉమ్మడిగా నిర్ధారించి, సభ్యత్వం తొలగించబడి, సుబేదారి పీఎస్ లో కేసు నమోదై ఉన్న తుమ్మ శ్రీధర్ రెడ్డి ఈ మొత్తం గొడవకు కారణమవుతున్నారని తెలిపారు. అందరి ఏకగ్రీవ నిర్ణయాన్ని బేఖాతరు చేసిన ఆయన మళ్లీ కొత్త ముసుగేసుకుని వచ్చి పలువురిని ప్రేరేపిస్తున్నారని, కొన్ని గ్రూపుల్లో తప్పుడు మెసేజ్ లు పెడుతున్నారన్నారు. తమపై ఆరోపణలు చేస్తున్న ఆ వ్యక్తి కారణంగా క్లబ్ లో శాంతిభద్రతలకు విఘాతం కలగటంతో పాటుగా సభ్యులు ఆందోళన చెందుతున్నారన్నారు.

ఈ క్రమంలో మరోసారి సుబేదారి పీఎస్ లో పిటీషన్ ఇవ్వటం జరిగిందన్నారు. సభ్యులు కానివారిని, జర్నలిస్టులు కానివారిని వెంటపెట్టుకుని వచ్చి హంగామా చేసే ప్రయత్నం చేశారని, క్లబ్ లోపల కార్యదర్శి పర్మిషన్ లేకుండా టెంట్ వేసే ప్రయత్నం చేశారని ఆరోపించారు. అంతే కాకుండా తమపైనే పీఎస్సీలో తప్పుడు ఫిర్యాదు చేశారని, వీటన్నింటిపై సుబేదారి ఇన్స్ పెక్టర్ కు, హనుమకొండ ఏసీపీకి వివరించటం జరిగిందన్నారు. అక్రమాలు చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, ఈ సందర్భంగా క్లబ్ సభ్యులకు హామీ ఇస్తున్నామన్నారు. ఎవరూ అపోహలను నమ్మవద్దని కోరారు. గతంలో వారిపై నమోదైన కేసు ఎఫ్ఐఆర్ కాపీని సైతం ఫిర్యాదుకు జతచేసినట్లు చెప్పారు. ఫిర్యాదు చేసిన వారిలో ఐజేయూ, ప్రెస్ క్లబ్ నాయకులు గడ్డం కేశవమూర్తి, తోట సుధాకర్, కంకనాల సంతోష్, పెండెం వేణుమాధవ్, కొండం రవీందర్ రెడ్డి, సీహెచ్ సోమ నర్సయ్య, వలిశెట్టి సుధాకర్, ఎండీ నయీం తదితరులు పాల్గొన్నారు.

**అవమానం జరగలేదు..**

అంబేడ్కర్ విగ్రహానికి ఎలాంటి అవమానం జరగలేదని, ఆ మహనీయుడి విగ్రహాన్ని జాగ్రత్తగా తీసి పక్కన పెట్టామని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారం సదయ్య ప్రకటించారు. అక్కడే మెరుగైన విగ్రహాన్ని ప్రతిష్టిస్తామని హామీ ఇచ్చారు. 30 ఏళ్ల క్రితం ప్రతిష్టించిన విగ్రహానికి ఏనాడు నివాళులర్పించిన వారు లేరన్నారు. ఇప్పుడు తప్పుడు ప్రకటనలు చేయటం విడ్డూరంగా ఉందన్నారు. 35 ఏళ్లుగా ఏ రోజు క్లబ్ లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కు నివాళులర్పించలేదన్నారు. మా కమిటీ వచ్చాకే ఆ మహనీయునికి ప్రతిఏటా ఘనమైన నివాళులు అర్పిస్తున్నామన్నారు. అందరినీ ఆహ్వానిస్తూ ఆ కార్యక్రమం చేస్తున్నామన్నారు. దానికి ఈరోజు మాట్లాడుతున్న, ఆరోపిస్తున్న వారు ఏనాడు హాజరు కాలేదన్నారు. దీనిని సభ్యులు గమనించాలన్నారు.

# మానసిక వికలాంగుల భద్రతకు ఐరిస్ టెక్నాలజీ

- **పార్లమెంట్ లో డాక్టర్ కడియం కావ్య**

**వరంగల్ వాయిస్, న్యూఢిల్లీ :** మానసిక వికలాంగుల భద్రత కోసం ఐరిస్ కెమెరా టెక్నాలజీని అమలు చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మంగళవారం పార్లమెంట్ లో కోరారు. వరంగల్ వంటి గ్రామీణ ప్రాంతాల్లో మానసిక వికలాంగుల గుర్తింపు, భద్రత కోసం ఐరిస్ ఆధారిత బయోమెట్రిక్ సిస్టమ్ ప్రయోజనాలపై, పైలట్ ప్రాజెక్టులు, నిధుల కేటాయింపు అవకాశాలపై ఎంపీ డాక్టర్ కడియం కావ్య కేంద్ర ప్రభుత్వాన్ని వివరణ కోరారు. దీనికి సమాధానంగా కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి బీఎల్ వర్మ, ఈ టెక్నాలజీ అమలు చేయాలన్న ప్రతిపాదన ప్రస్తుతం మంత్రిత్వ శాఖ పరిశీలనలో లేదని తెలిపారు. ఈ సమాధానంపై డాక్టర్ కావ్య తీవ్ర నిరాశ వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునరాలోచించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఐరిస్ కెమెరా టెక్నాలజీ పై సమగ్ర ప్రతిపాదనను సమర్పించనున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్ర అధికారులతో కలిసి ఈ టెక్నాలజీ అమలుకు కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా ఎంపీ కోరారు.



# అంబేద్కర్ కు అవమానం

**ఇన్ స్పెక్టర్ కు జర్నలిస్టుల ఫిర్యాదు**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గత 35 సంవత్సరాలుగా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని కమిటీ నిర్ణయం లేకుండా అవమానకరంగా తొలగించిన ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు జర్నలిస్టులు మంగళవారం సుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శుల ఆదేశాల మేరకు అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ లెనిన్, మస్కపురి సుధాకర్, అర్షం రాజ్ కుమార్, తుమ్మ శ్రీధర్ రెడ్డి, గోకారపు శ్యాంకుమార్, నంబూద్రిపాద్, బొడిగె శ్రీను, సిరిమల్ల సదానందం, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మరో మూడు రోజులు భారీ వర్షాలు

- **ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలి**
- **జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్ నుంచి డాక్టర్ సత్య శారద ఆదనపు కలెక్టర్, జిల్లా, మండల స్థాయి అధికారులు, తహసిల్దార్లతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా పరిస్థితులను సమీక్షించి సమర్థవంతంగా నిర్వహణకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షాల కారణంగా అత్యవసర సహాయార్థం ప్రజల కొరకు వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 1800 425 3424, టోల్ ఫ్రీ నెంబర్ కు 9154252936 మొబైల్ నంబర్ కు అదేవిధంగా వరంగల్ పట్టణానికి సంబంధించి జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 1800 425 1980 టోల్ ఫ్రీ నెంబర్ కు 9701999676 నెంబర్లకు సంప్రదించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా జిల్లా మండల అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి ముఖ్యంగా తాసిల్దారులు, ఆశా వర్కర్లు, అంగన్వాడి వర్కర్లు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో తిరుగుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండి సేవలందించాలని కోరారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా పరిషత్ సీఈవో రామిరెడ్డి, వైద్య ఆరోగ్య, ఇరిగేషన్, పంచాయతీ, అగ్నిమాపక, బల్దియా, కుడా, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు తహసిల్దారులు ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

**హనుమకొండలో కంట్రోల్ రూమ్..**

భారీ వర్షాల నేపథ్యంలో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించిన నేపథ్యంలో సంబంధిత శాఖలను అప్రమత్తం చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. కంట్రోల్ రూమ్ నెంబర్ 7981975495 ను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ ప్రజలకు సూచించారు.

# అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

- **మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీ**
- **లోతట్టు ప్రాంతాల సందర్శన**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో మంగళవారం ఉదయం నుంచి మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీ వరంగల్ తూర్పు నియోజకవర్గం 32 వ డివిజన్ లోని బీఆర్ నగర్, ఎన్ఎన్ నగర్, 40వ డివిజన్ డీకే నగర్, 35వ డివిజన్ మైసయ్య నగర్, 38వ డివిజన్ ఖిలా వరంగల్ లోని అగర్తలా చెరువు, 27వ డివిజన్ కొండా పటేల్ కాలనీ, అండర్ బ్రిడ్జ, 28వ డివిజన్ ఎన్టీఆర్ నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కొండా మురళీధర్ రావు మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసరమైతే తప్ప బయటికి రాకూడదని తెలిపారు. అధికారులు కూడా అప్రమత్తంగా ఉంటూ రహదారులపై ప్రవహిస్తున్న వరద నీటిని ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలన్నారు. విద్యుత్ సరఫరా, తాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. భారీ వరదలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. అతి భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అధికార యంత్రంగానికి సంపూర్ణంగా సహకరించాలని తెలిపారు. ప్రజలెవరూ అధైర్య పడొద్దన్నారు. తాము అండగా ఉంటామంటూ హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, కాంటెస్టెడ్ కార్పొరేటర్ లు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ శ్రేణులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సహాయక చర్యల్లో పాలుపంచుకోవాలని ఈ సందర్భంగా కొండా మురళీధర్ రావు పిలుపునిచ్చారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com